క్లుప్తంగా

నేత్రపర్వంగా నారాయణుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దపప్పూరు: పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వర్థనారాయణస్వామి క్షేత్రంలో కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్‌కుమార్‌శర్మ ఉత్సవమూర్తులను పట్టుపస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పూలపల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. వేడుకను తిలకించడానికి పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం, కార్యనిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఓబులేసుడి ఉత్సవాలు

యల్లనూరు: బొప్పేపల్లి గ్రామ సమీపంలోని కొండ కోనల్లో వెలసిన ఓబులేసుడి స్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓబులేసుడి స్వామికి అర్చనలు, అభిషేకాలను నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

యాదుల్లా ఉరుసు



దర్గాలో మొక్కుకుంటున్న భక్తులు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట (కొత్తూరు)లోని చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా రహంతుల్లా అలైహి ఖాద్రీ 174వ ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫకీర్లు మేళతాళాలతో గ్రామం నుంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించి గుర్రంపై ఉంచి గంధంను చెరువు కట్ట వరకు ఊరేగించి దర్గాలో సమర్పించారు. భక్తులు దర్గాలో చక్కెర చదివించడంతోపాటు గుమ్మస్‌పై చాదర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. శనివారం జియారత్, షంషీర్‌లతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

తిక్కస్వామి దర్గా ఉరుసు



పుష్పాలంకరణలో దర్గా

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో వెలసిన తిక్కస్వామి దర్గాలో ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం అర్ధరాత్రి తిక్కస్వామి దర్గా నుంచి ఊరేగింపుగా బయలుదేరిన స్వామివారు శుక్రవారం ఉదయానికి కసాపురానికి చేరుకుని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడుగడుగునా స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులతో కలసి ఊరేగింపుగా తిరిగి దర్గాకు చేరుకున్న స్వామి వారిని అక్కడ కొలువుదీర్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లలితాదేవికి శ్రీచక్ర అర్చన పూజ



లలితాదేవికి పూజలు చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో పుణ్యం వెన్నెలలో లలితాదేవికి శ్రీచక్ర అర్చన పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు వాసుదేవ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మణిదీప వర్ణ అర్చన పూజ నిర్వహించారు. వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు యక్కల రాధాదేవి, సెక్రటరీ కృష్ణవేణి, కోశాధికారి గీతా వాణి, సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

యల్లనూరు: మండలంలోని ఎస్.కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీంద్ర తెలిపారు. కొత్తపల్లి, నీర్జాంపల్లి, దంతలపల్లి, సింగవరం గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని ఏఈ తెలిపారు.

నిరుపయోగంగా అవుట్ పోస్టులు

● సిబ్బంది కొరతతో మూతపడిన వైనం ● పట్టించుకోని పోలీస్ ఉన్నతాధికారులు ● పేట్రేగిపోతున్న మందు బాబులు



ఆర్అండ్‌బీ సర్కిల్‌లో మూతపడిన పోలీస్ అవుట్ పోస్టు



ప్రభుత్వాస్పత్రి వద్ద మూతపడిన పోలీస్ అవుట్ పోస్ట్

గుంతకల్లు టౌన్: నేరాల నియంత్రణ, పురప్రజల అవసరాల రీత్యా పట్టణంలోని ఆర్అండ్‌బీ సర్కిల్, మెయిన్‌రోడ్డు ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టులు(ఓపీ) నిరుపయోగంగా మారాయి. ఆయా అవుట్ పోస్టు స్టేషన్‌లకు ప్రత్యేకించి కనీసం ఒక్క కానిస్టేబుల్‌ను కూడా నియమించకపోవడంతో ప్రస్తుతం అవి మూతపడ్డాయి. దీంతో ఎవరైనా ఫిర్యాదులు చేయాలన్నా, తమ సమస్యలను విన్నవించుకోవాలన్నా పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి. పెరిగిన పట్టణ జనాభా, జఠిలంగా మారిన ట్రాఫిక్ సమస్యతో పాటు పోలీసులంటే ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారికి మరింతగా చేరవయ్యేందుకు వీలుగా 13 ఏళ్ల కిందట అప్పటి జిల్లా ఎస్పీ షానవాజ్ ఖాసీం పట్టణంలో రెండు పోలీస్ అవుట్‌పోస్టుల నిర్మాణానికి ఆదేశించారు. దీంతో అప్పటి డీఎస్పీ సుప్రజ నేతృత్వంలో ప్రభుత్వాస్పత్రితో పాటు నిత్యం జనం రద్దీగా ఉంటూ మందుబాబులకి కేరాఫ్‌గా మారిన ఆర్అండ్‌బీ సర్కిల్‌లో అవుట్‌పోస్టుల నిర్మాణానికి సంకల్పించారు. పట్టణానికి చెందిన దాతలు, పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో అవుట్‌పోస్టులను అందంగా నిర్మించి 2013 రిపబ్లిక్‌డే రోజు ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడంతో అవసరమైతే ఫిర్యాదులు కూడా చేయవచ్చని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. అవుట్ పోస్టులకు కానిస్టేబుళ్లను కూడా నియమించారు. కొన్నేళ్ల పాటు రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆయా ఔట్‌పోస్టుల్లో పోలీసులు విధులు నిర్వర్తించే వారు. ఫలితంగా పోలీసులున్నారన్న భయంతో ఆర్అండ్‌బీ సర్కిల్‌లో మద్యంబాబుల ఆగడాలకు తగ్గుముఖం పట్టాయి. కానీ కొన్ని నెలలుగా ఈ ఓపీకి సిబ్బందిని నియమించని కారణంగా మద్యంబాబులు తూలుతున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో పాటు ప్రార్థనా మందిరాలు, నాలుగు స్కూళ్లు అక్కడే ఉన్నాయి. ఆ మార్గం గుండా వెళ్లాలంటే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ప్రభుత్వాస్పత్రిలోకి ఏవైనా యాక్సిడెంట్ కేసులు వచ్చినా పోలీసులు హుటాహుటిన స్పందించేవారు. సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతం ఈ అవుట్ పోస్టులు మూతపడి వెలవెలబోతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీస్ అవుట్ పోస్టులకు సిబ్బందిని నియమించి, యథావిధిగా వాటిని కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పునఃప్రారంభిస్తాం

విధినిర్వహణలో భాగంగా బందోబస్తులతో పోలీసు సిబ్బందిగా బిజీగా ఉండటం, సిబ్బంది కొరత కారణంగా ఆర్అండ్‌బీ సర్కిల్‌లోని పోలీస్ అవుట్‌పోస్టును వినియోగంలోకి తేలేదు. ఇటీవల అవుట్ పోస్టు మరమ్మతులు కూడా చేయించాం. ఆర్అండ్‌బీ సర్కిల్‌లో జనర ద్దీ దృష్ట్యా ఔట్‌పోస్టును ఉన్నతాధికారుల చేత వీలైనంత త్వరలో ప్రారంభిస్తాం.

– బి.మనోహర్, వన్‌టౌన్ సీఐ, గుంతకల్లు

వినియోగంలోకి తీసుకురావాలి



పట్టణంలోని పోలీస్ అవుట్ పోస్టులను తెరిపించి అక్కడ సిబ్బందిని నియమించాలని పోలీసు ఉన్నతాధికారులను గతంలో కలిసి విన్నవించాం. ప్రధానంగా ఆర్అండ్‌బీ సర్కిల్ మీదుగా స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, రైల్వేక్వార్టర్స్, ఆస్పత్రులకు వెళ్లే మార్గం కావడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా ఉంటోంది. వైన్‌షాపు కూడా అదే సర్కిల్‌లో ఏర్పాటు చేయడంతో రాత్రివేళల్లో ఆ మార్గం మీదుగా మహిళలు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు.

– బి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు, గుంతకల్లు

చర్యలు తీసుకుంటాం

స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద నున్న పోలీస్ అవుట్ పోస్టును పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. తొందర్లోనే అవుట్ పోస్టులను వినియోగంలోకి వినియోగంలోకి తీసుకువస్తాం.

– మస్తాన్, టూటౌన్ సీఐ, గుంతకల్లు

ఘనంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లిలో శుక్రవారం చెన్నకేశవ స్వామి కల్యాణం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కొండపై ఉన్న ఆలయంలో అర్చకులు వేకువజాము నుంచి స్వామికి నవగ్రహ పూజ, మంగళహారతి, బిల్వార్చన, ఆకుపూజ, అభిషేకం, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి కల్యాణం వైభవంగా జరిపించారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. చెంద్రాయుని కుంట సమీపంలోని కొండపై ఉన్న ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామం వరకూ సాగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నకేశవ స్వామి నామస్మరణతో మార్మోగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా నాగలింగేశ్వరుడి తిరునాల



విద్యుద్దీపాల అలంకరణలో దేవాలయం, (ఇన్‌సెట్‌లో) నాగలింగేశ్వరస్వామి

బుక్కరాయసముద్రం: మండలంలోని నీలాంపల్లిలో నాగలింగేశ్వర స్వామి తిరునాల శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి ఆలయంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, నవగ్రహపూజ, కలశ స్థాపన, రుద్రాభిషేకం, పుష్పాలంకరణ అర్చనలు, మహా నైవేద్యం, మహా మంగళ హారతి, నిర్వహించారు. రాత్రి 10 గంటల నుంచి 2 గంటల వరకూ లంకా దహనం నిర్వహించారు. లంకా దహనం వీక్షించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం వైభవంగా సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. వ్రతం అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందించామని నిర్వాహకులు తెలిపారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి సాయం

పామిడి: పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన బాధిత ఆటో డ్రైవర్ బోయ శివ కుటుంబానికి రెడీమేడ్ దుస్తుల వ్యాపారి నారాయణశెట్టి కుమారుడు నరేష్ ఆర్థికసాయం చేశారు. స్థానిక ఆరోగ్య హాస్పిటల్ డాక్టర్ నిర్వాకం వల్ల ఇంజెక్షన్ వికటించి బోయ శివ మంచానపడిన విషయం విదితమే. దీంతో అతడి కటుంబానికి జీవనోపాధి దుర్లభమైంది. స్థానిక మానవతావాదులు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు, రామాంజనేయులు సహకారంతో నరేష్ సాయం చేశారు. అందులో భాగంగా బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు రూ.10వేలు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటారు.

మహిళను బెదిరించి రూ.10 వేల చోరీ

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె పారిశ్రామిక వాడలో బండల పాలిష్ ఫ్యాక్టరీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వరమ్మ ఇంట్లోకి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి చొరబడి, ఆమెను బెదిరించి రూ.10వేల నగదును అపహరించాడు. ఈ మేకు ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే రెండు రోజుల క్రితం యర్రగుంటపల్లి వద్ద మేకలు మేపుకుంటుండగా అటుగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక్క మేకను ఎత్తుకుని పారిపోయినట్లు బాధితుడు మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

గార్లదిన్నె: ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం శనివారం నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తారా చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పాఠశాలలు నిర్వహించాలన్నారు. అలాగే పదో తరగతి పరీక్ష సెంటర్ ఉన్న గార్లదిన్నె మోడల్ స్కూల్, గార్లదిన్నె, కల్లూరు హైస్కూల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పాఠశాలలు నిర్వహించాలన్నారు.

ఈశ్వరయ్య మృతి తీరని లోటు

నార్పల: వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొదమల ఈశ్వరయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన ఈశ్వరయ్య మృతదేహానికి సత్యనారాయణ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

వృద్ధుడి మృతి

పామిడి: అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం మద్యం మత్తులో మృతిచెందిన వ్యక్తిని గుంతకల్లు మండలం అయ్యవారపల్లి గ్రామ వాసి హనుమేష్‌రెడ్డి(68)గా గుర్తించారు. ముందు అనంతపురం పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. అనంతరం పామిడి పోలీసుల సహకారంతో మృతుడు అయ్యవారపల్లి గ్రామవాసిగా శుక్రవారం గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ తోటకు నిప్పు

శింగనమల: శింగనమల ఎస్సీ కాలనీకి చెందిన పర్లగొల్ల ముత్యాలప్ప చీని తోటకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టడంతో కాపుకు వచ్చిన 80 చెట్లు కాలిపోయాయి. బాధిత రైతు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం 4.50 ఎకరాల్లో చీనీ పంటను సాగు చేశాడు. బోరు వేసి డ్రిపు సౌకర్యంతో చీని పంటను సాగు చేశానన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో, కాపునకు వచ్చిన 80 చీని చెట్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయి, రూ.3 లక్షల వరకూ నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్, సీఐ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద కమ్మ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్ర నాయుడు, మల్లికార్జున ఆధ్వర్యంలో మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, సీఐ వెంకటేశ్వర్లు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్మసేవా సంఘం కోశాధికారి రమేష్ బాబు, గౌరవాధ్యక్షులు కేశన్న, గౌరవ సలహాదారులు కృష్ణారావు, కేశవ నాయుడు, రవి, నారాయణస్వామి, సర్పంచు భరత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభ

పుట్లూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై తనిఖీలు చేపట్టి వెల్లడైన అంశాలను గ్రామ సభలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ నరేంద్ర, ఉపాధి సిబ్బంది, డీఆర్‌పీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

గుంతకల్లుటౌన్: అత్యంత దుర్భరమైన జీవితాలను గడుపుతున్న కాటి కాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కోరారు. సచివాలయంలో మంత్రిని కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి జగ్గిలి రమేష్ తదిరులతో పాటు గుంతకల్లు మండలానికి చెందిన కాటికాపరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దళితులకు శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణపై నిరసన

పుట్లూరు: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికలకు ముందు అధికారం కోసం విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం చేసి అధికారంలోకి వచ్చిన అనంతరం కర్మాగారాన్ని ప్రైవేటీకరణ దిశగా ప్రధానమంత్రి మోదీ బినామి అయిన అంబానీకి అప్పగించాలని చూడటం దారుణమన్నారు. 32 మంది బలిదానంతో నిర్మించిన ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయాలని చూడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 60 అడుగుల రోడ్, పాతబస్టాండ్ ఏరియాల్లో శుక్రవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహ్మద్ పారిశుధ్య పనులను పరిశీలించారు. డంపర్ బిన్‌ల వద్ద నిండిపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాల్లో సున్నం చల్లాలని సిబ్బందికి ఆయన సూచించారు. చెత్తాచెదారాన్ని డ్రైనేజీల్లో పడేయవద్దని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీ పక్షి స్వాధీనం



గుంతకల్లుటౌన్: పట్టణంలో కాకాటియల్ (విదేశీ చిలుక) పక్షిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ధర్మవరం గేట్ ఏరియాలో ఆర్.కె.పెట్‌జోన్ షాపు నిర్వాహకుడు రాఘవేంద్ర ఈ విదేశీ పక్షిని విక్రయిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారికి సమాచారం అందింది. దీంతో శుక్రవారం స్థానిక అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, ఎఫ్ఆర్ఓ మధుబాబు తదితరులు దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విక్రయించడానికి పంజరంలో బంధించిన కాకాటియల్ విదేశీ పక్షిని స్వాధీనం చేసుకుని, షాపు నిర్వాహకుడి పై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆనందోత్సాహాల నడుమ హోలీ సంబరాలు



శింగనమలలోని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఇంటి వద్ద హోలి సంబరాలు

గుంతకల్లుటౌన్/శింగనమల/గుత్తి/పెద్దవడుగూరు/పామిడి/బుక్కరాయసముద్రం/యల్లనూరు/గార్లదిన్నె: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నా,పెద్ద తేడా లేకుండా సంబరాల్లో మునిగి తేలారు. కేరింతలు కొడుతూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువతీ, యువకులు ఎంతో ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ అలంరించారు. పామిడిలో డబ్బేదార్‌ఫిర్కా, రంగసుభేఫిర్కాల ఆధ్వర్యంలో ఎద్దుల బండ్లలో రంగునీళ్ల డబ్బాలను ఉంచుకుని వీధుల్లో రంగులు వెదజల్లుకుంటూ హోలీ సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు శనివారంరాత్రి స్థానిక ఉట్లమాను లకుండే స్వామి సత్రం వద్ద కామ దహనం చేశారు.



గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



పామిడిలో కామ దహనం దృశ్యం



శింగనమలలో రంగులు చల్లుకుంటున్న యువకులు



పెద్దవడుగూరులో రంగు నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు

ఉగాది ఉత్సవాల నిర్వహణపై నేడు సమీక్ష

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 1 వరకూ ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ కె.వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ సమీపంలోని రామదూత నిలయంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె సూచించారు.